# కథ

# పాడవే ఓ కోయిలా...

**జీవితం ఓ అనుభవాల దొంతర. సుఖదుఃఖాల పరదాల మాటున పొంచి వున్న జ్ఞాపకాలు నిరంతరం తొంగిచూస్తూనే వుంటాయి. వర్తమానాన్ని ప్రభావితం చేసే గతకాలపు జ్ఞాపకాలు వద్దన్నా వదలవు. చివరి నిమిషం దాకా వెన్నాడుతూనే వుంటాయి.**

లెసన్ ప్లాన్ ప్రిపేర్ చేసుకుంటున్నా. నా మనసు నిండా మధు తాలూకు చేదు జ్ఞాపకాలే మెదులుతున్నాయి. ఈరోజు అతని పుట్టినరోజు. అందుకే ఈరోజు మరీ మరీ గుర్తొస్తున్నాడు. నరకమంటే ఏవిటో రుచి చూపించిన అతన్ని ఈ మనసులోంచి ఆవలికి నెట్టేయడం ఎలాగో తోచడం లేదు. మొదటి పీరియడ్ తర్వాత రెండు క్లాసులు లీజర్ కావడంతో తీరిగ్గా వున్నాను. స్టాఫ్ రూంలో కూడా ఎవరూ లేరు. మిగతా లెక్చరర్స్ అందరూ క్లాసెస్‌కి వెళ్లిపోయారు.

"మేడమ్! మీ కోసం ఎవరో..." అటెండర్ మాట పూర్తి కాకముందే, స్టాఫ్ రూంలోకి వచ్చాడు అతను. ప్లెయిన్ ఫుల్ స్లీవ్స్ షర్ట్ టక్ చేసుకుని హుందాగా వున్నాడు. ఎక్కడో చూసినట్టనిపించింది. కానీ చప్పున గుర్తుకు రావడంలేదు.

"హలో హరితా! నన్ను గుర్తుపట్టనే లేదా?" కళ్లజోడు తీస్తూ అడిగాడు.

నాకు చాలా అయోమయంగా వుంది. తెలిసిన వ్యక్తి మాదిరే ఉన్నాడు కానీ ఎవరో ఆనవాలు పట్టలేకపోతున్నాను.

"అయాం సారీ... మీరు..."

"సరే నేనే చెప్తాన్లెండి" నవ్వాడు మళ్లీ.

"కూర్చోండి.." చెప్పాను.

"నేనండీ ఆనంద్‌ని. మనం టెన్త్ క్లాస్ వరకూ కలిసి చదువుకున్నాం. ఆరోజుల్లో ఫోర్‌మోస్ట్ మడ్ హెడ్‌ని నేనే అని లెక్కల మేడమ్ వసుంధరాదేవి తిట్టేవారు నన్ను. గుర్తొచ్చానా?"

నాకు గుర్తొచ్చింది. నవ్వు కూడా వచ్చింది. ప్రతిరోజూ నా లెక్కల నోట్సు తీసుకుని వున్నదున్నట్టు ఎక్కించేసుకునేవాడు. హిందీ కాపీ మొత్తం తెలుగు లిపిలో రాసుకుని చదివే మొద్దబ్బాయి ఆనంద్. అప్పటికీ ఇప్పటికీ ఎంత మార్పో!

"నువ్వా! చాలా మారిపోయావు ఆనంద్. అసలెలా తెలిసింది నా గురించి? పదిహేనేళ్లు గడిచిపోయాయి కదూ"

"ఇంకా ఎక్కువ కాలమే అయ్యుంటుంది. నీకోసం రెండేళ్లుగా వెతుకుతూనే వున్నాను హరితా! 'నువ్వు' అనేస్తున్నాను. ఏమీ అనుకోవు కదూ" అడిగాడు.

"మీరు అంటూ కొత్త మన్నింపులు మొదలెడితేనే ఏమైనా అనుకుంటాను. ఇంతకీ ఏవిటీ విశేషాలు? నాకైతే ఎంత సంతోషంగా వుందో అంత ఆశ్చర్యంగా కూడా వుంది. ఇంకా నన్ను గుర్తు పెట్టుకున్నందుకు" మనస్ఫూర్తిగా చెప్పాను.

"ఈరోజున నేను ఇంజనీర్‌ని అయినానంటే దానికి కారణం నువ్వే హరితా. పెడదారి పడుతున్న నా అడుగులకి ఓ గమ్యం నిర్దేశించిన మనిషివి నువ్వు. నిజం. నేనీ పొజిషన్‌కి వస్తే, సంతోషించే వాళ్లలో మొదటిదానివి నువ్వే అన్నావు ఆరోజు. నీ కళ్లల్లో ఆ ఆనందం చూడడం కోసమే నేను కష్టపడి చదివాను. ఉద్యోగం సంపాదించాను. అప్పటి నుంచి వెతుకుతున్నాను నీకోసం. అనుకోకుండా నీ ఫ్రెండ్ రజని కనబడింది. తన ద్వారా నువ్వు ఈ కాలేజ్‌లో లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తున్నావు అని తెలిసింది." నన్ను కలిసిన ఉత్సాహంలో గడగడా చెప్పుకుపోతున్నాడు ఆనంద్.

అతని కళ్లల్లో ఇంకా అవే మెరుపులు. పదో తరగతి చదివేటప్పుడు వున్న అమాయకపు రూపానికి, ఈనాటి హుందాతనానికీ మాత్రం బోలెడు వ్యత్యాసం. నాకు స్కూల్ పరిసరాలు గుర్తొస్తున్నాయి. క్లాస్ రూంలో అల్లరి గుర్తొస్తోంది. తెలిసీ తెలియని వయసు, ఎదిగీ ఎదగని మనసు. ఆ రెండూ ఒక్కచోట వుండనీయక తొందర. తను క్లాస్‌లో ఎప్పుడూ ఫస్ట్ ర్యాంకరే. సహజంగానే టీచర్లందరికీ తనంటే అభిమానం. అందుకు పూర్తిగా వ్యతిరేకం ఆనంద్. తమ క్లాసులో నలభై మంది వుంటే కేవలం ఏడుగురే అమ్మాయిలు. మిగతా వాళ్లల్లో చదువులో మొద్దబ్బాయి, అల్లరిలో మొదటి అబ్బాయి ఆనంద్. టీచర్లందరూ అతన్ని తిడుతుంటే తనకి బోలెడు జాలేసేది. అందుకే అతనికి తన నోట్సులు ఇచ్చేది. ఆరు నెలల పరీక్షలకి ముందు, తన సైన్సు నోట్స్ అతనికిస్తే, అందులో ఓ లెటర్ రాసి పెట్టాడు ఆనంద్.

ప్రియురాలైన హరితకు,

నీవంటే నాకు చాలా ఇష్టము. నీకు కూడా నా పట్ల ఇష్టము అని నేను తలచుచున్నాను. ఎందుకనగా నీవు నీ పుస్తకములు నాకు ఇచ్చుటయేకాక, పరీక్షలయందు కూడా నన్ను నీ జాబు పత్రము నుండి కాపీ కొట్టనిచ్చుచున్నావు. నా స్నేహితులు కూడా నువ్వు నన్ను ప్రేమించుచున్నావని నమ్మకముగా చెప్పినారు. మన నాన్ డిటెయిల్‌లోని ఉషాకుమారి, అనిరుద్ధుల వలె మనము కూడా ప్రేమించుకుని పెళ్లి చేసుకుందాము. నీ జవాబు కొరకు నేను ఎదురుచూడగలను.

ఇట్లు
నీ ప్రియాతి ప్రియుడు
ఆనంద్.

పి.ఎస్.: ఈ లేఖను మీ అమ్మా నాన్నలకు, టీచర్లకి చూపిన యెడల నేను మన స్కూలు ప్రక్కనే వున్న రైల్వే ట్రాక్‌పై తల పెట్టగలను. గ్రహించగలవు. స్పెల్లింగ్ తప్పులున్నచో సరిచేయగలవు.

నిండా పదిహేనేళ్లులేని ఆనంద్‌కి ప్రేమేంటో, పెళ్లేంటో నాకు అర్థం కాలేదు. అతను రాసిన తీరుకి నాకు అప్పట్లో తెగ నవ్వు కూడా వచ్చేది. అతన్ని ప్రత్యేకంగా కలిసాను. నీలం రంగు స్కర్టులో నేనూ, అదే రంగు నిక్కరూ, తెల్ల చొక్కాలో తనూ. ప్రేమికుడు కదా, అతనికి నా వయసు తప్ప, పాపం తన వయసు గుర్తుకు రాలేదు.

ఉత్తరం అతని చేతిలో పెట్టాను.

"ఆనంద్! నువ్వు రాసింది చాలా బాగుంది కానీ డేటూ ప్లేసూ రాయలేదు. అడ్రస్ కూడా రాయలేదు నువ్వు. మనకి తెలుగులో లెటర్ రైటింగ్ వుంది కదా! ప్రాక్టీసు చేస్తే నీకు ఫుల్ మార్క్స్ వస్తాయి" అన్నాను.

"హరితా! నేను నీకు రాసింది నిన్ను దిద్దమని కాదు, అది ప్రేమలేఖ" తడబడుతూ అన్నాడు.

"అమ్మబాబోయ్! మా అమ్మావాళ్లకి తెలిస్తే ఇంకేమైనా వుందా? అయినా నువ్వేమైనా ఇంజనీరువా డాక్టరువా? టెన్త్‌క్లాస్ కూడా అవలేదు అప్పుడే ప్రేమా దోమా అంటావేమిటి? అయ్!" అన్నాను కోపంగా.

"అయితే నేను ఇంజనీర్ని అయితే నన్ను పెళ్లి చేసుకుంటావా?" దీనంగా అడిగాడు ఆనంద్.

"తప్పకుండా చేసుకుంటాను. ముందు ఈ పదో క్లాసు గట్టెక్కు. కావాలంటే నా బుక్స్ తీసుకుని చదువు" అని వచ్చేసాను.

టెన్త్ రాసాక అతనెవరో, నేనెవరో! నేనసలు అతని ఊసే మరిచిపోయాను.

"వీడేంటి? ఇంజనీరేంటి అనుకుంటున్నావ్ కదూ హరితా?" నవ్వుతున్నాడు ఆనంద్.

బొద్దుగా ముద్దుగా వుండే ఆనంద్ పొడుగు సాగాడు. చెప్తే తప్ప తెలీనంతగా మారిపోయాడు.

"నువ్వు రాసిన లెటర్ గుర్తొస్తే ఇప్పటికీ నవ్వొస్తుంది" చెప్పాను.

"అదింకా నా దగ్గర జాగ్రత్తగా వుంది హరితా! ఈసారి వచ్చేటప్పుడు తెచ్చి చూపిస్తాను. ఇంతకీ నీ విశేషాలేమిటి? ఎలా వుంది వుద్యోగం?" అడిగాడు.

ఎన్నాళ్ల తర్వాతనో ఆత్మీయంగా మాట్లాడే వ్యక్తి కనిపిం



చడంతో హాయిగా మనసు విప్పి మాట్లాడాను. బోలెడు స్కూలు విషయాలు కలబోసుకున్నాం. కాలేజీ చదువుల గురించి చెప్పుకున్నాం. ఉద్యోగంలోని సాధకబాధకాలు చర్చించుకున్నాం. చాలారోజుల తర్వాత నా మనసు మాటల పల్లకీ ఎక్కి ఊరేగింది. అణిగిపోయిన ఉల్లాసం, ఉత్సాహం పెల్లుబికాయి. రెండు గంటల కాలం ఎలా గడిచిపోయిందో! మరో రెండు మూడు రోజుల్లో మళ్లీ కలుస్తానని చెప్పి వీడ్కోలు తీసుకున్నాడు ఆనంద్.

* * *

ఇంటి గుమ్మంలో తాళం కప్ప ఎదురు చూస్తోంది నాకోసం.

ఎప్పట్లాగే ఇంటావిడ గేటు తీసిందెవరా అని చూసి మళ్లీ లోపలికి వెళ్లిపోయింది.

టీ కూడా తాగాలనిపించలేదు.

ఆనంద్ అందించిన ఆనందం నా మనసుకి హాయినిస్తోంది. ఎప్పుడో కరిగిపోయిన బాల్యస్మృతులు కళ్లముందు మెదులుతున్నాయి.

'నా ఆనంద్! నాకోసం వచ్చాడు' ఈ అనుభూతి నన్ను ఉయ్యాలలూపుతోంది. స్తబ్దంగా మారిపోయిన నా జీవనగమనంలోకి ఓ పిల్లతెమ్మెరలా అనిపిస్తోంది అతని రాక. మోడువారిపోయిన నా బ్రతుకులో, చిరుజల్లులు చిలకరించి వెళ్లాడు ఆనంద్. ఏదో మాటవరసకి అన్న మాటని, ఇన్నాళ్లపాటు మోసిన అతన్ని తల్చుకుంటేనే నాకు ఆనందం తన్నుకు వస్తోంది. ఇప్పుడు నాకు మధు గుర్తుకు రావడంలేదు. అనుమానం పెనుభూతమై నన్ను అవమానాలపాలు చేసిన, నా మాజీ భర్త జ్ఞాపకాలు మరుగున పడ్డాయి. అగ్నిసాక్షిగా ఏర్పడిన వివాహబంధం, అతని అహంకారానికి బలైపోయిన వైనం జ్ఞాపకం రావడం లేదు. అసలు విడాకులు తీసుకుని ఒంటరిగా బ్రతుకుతున్నానన్న స్పృహ ఇన్నాళ్లకి, నన్ను వదలివెళ్లిపోయింది. దీనికి కారణం ఆనంద్ రాక. నా పాలిట ఏరువాక.

బైట చీకట్లు అలుముకుంటుంటే అప్పుడు తెలిసింది నేనింకా లైట్లు వెయ్యలేదని. లేచి ఇంట్లో వెలుగు నింపాను. నాకోసం వచ్చిన ఆనంద్ మాటల వెలుగు ముందు, ఈ దీపాల వెలుగెంత? కన్నెపిల్లలా గంతులేస్తోంది నా మనసు. చీకటి తొలగిపోయింది. కొత్త వెలుగు కిరణాలు ప్రకాశిస్తున్నాయి. కొత్త జీవితం పంచుకోబోతున్న కోరికని మనసు వ్యక్తం చేస్తుంటే నిద్రలోకి జారుకున్నాను.

* * *

రెండు రోజులు యుగాలుగా గడిచాయి. చిన్ననాటి మిత్రుణ్ణి గురించి కొలీగ్స్‌కి చెపితే, వాళ్ల ఆశ్చర్యానికి అంతే లేదు. పదో తరగతి అడాలిసెంట్ వయసెక్కడ? పరిణతి చెందిన ఈ వయసెక్కడ? ఆశ్చర్యంతోపాటు ఒకింత ఆతృతతో చూస్తున్నారు వాళ్లు కూడా ఆనంద్ రాక కోసం. నా ఆనంద్‌తో నేను పంచుకోబోయే జీవితం గురించి తెలిస్తే, వాళ్లు అసూయ కూడా పడ్తారేమో!

లంచ్ టైం అవుతుండగా వచ్చాడు ఆనంద్. ఇద్దరం కలిసి బైటికి వచ్చాం. హోటల్‌లో కూర్చున్నాక లంచ్‌కి ఆర్డర్ ఇచ్చాడు.

"ఇదంతా కలలాగా వుంది ఆనంద్. నా చిన్న మాట మీద నువ్వు ఇంత పెద్ద హోదాకి పెరిగావంటే!" చెప్పాను.

"నిన్ను కలవగలగటం మాత్రం నాకు ఇంకా నిజం కాదేమో అనిపిస్తోంది హరితా! బై ది బై నిన్న నీ కెరీర్ విషయాలు తప్ప నీ గురించేం చెప్పలేదు. ఇంకా ఒంటరివేనా? పెళ్లి కాలేదా?"

"పెళ్లయినా ఒంటరినే" నోటి దాకా వచ్చిన మాటని ఆపేశాను. ఏదో చెప్పబోతూంటే అతనే అన్నాడు-

"ఇదిగో ఈ ఫొటో చూడు. ఈమె నా బెటర్ హాఫ్ శ్వేత. ఇదిగో ఇది స్వీట్ హార్ట్, నా కూతురు హరిత. నీ పేరే పెట్టుకున్నాను దానికి" జేబులోంచి తీసిన డైరీ లోంచి వాళ్ల ఫొటోల్ని తీసి చూపిస్తున్నాడు ఆనంద్.

ఓ నిమిషం ఆగి మళ్లీ స్పందిస్తున్న గుండె తన ఆవేదనని బహిర్గతం చేయడానికి నా కళ్లని వాడుకుంటూంటే ఆ అశ్రువుల్ని దాచడం కోసం తలని పూర్తిగా వంచి ఆ ఫొటోల్ని తదేకంగా పరిశీలిస్తున్నట్టు నటిస్తున్నాను. పదిహేనేళ్ల ప్రాయంలో అతనిది అడాలిసెంట్ ప్రేమ అయితే పాతికేళ్లు దాటినా నాదీ అడాలిసెంట్ ప్రేమే.

రెస్టారెంట్‌లోని రేడియోలోంచి పాట వినిపిస్తోంది - 'ఇది వెన్నెల వేళయనీ, ఇది మల్లెల మాసమనీ' అంటూ. ఆ కోయిల తొందరపడి కూసిందేమో! నేను మాత్రం చాలా ఆలస్యం చేశాను. వసంత మాసం దాటిపోయిందని మరిచేపోయాను.

పద్మలతా జయరాం